ఏఆర్వో కార్యాలయం పరిశీలన

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 27: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మానకొండూర్ సహాయ ఎన్నికల అధికారి కార్యాలయాన్ని శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్విని కుమార్ పాండ్య సందర్శించారు. కార్యాలయంలో నిర్వహించే రికార్డులను పరిశీలించారు. అధికారులు, ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మానకొండూర్ తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి సీహెచ్ రాజు, నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య, ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ సమీన, సిబ్బంది ఉన్నారు.

సర్వసభ్య సమావేశాలు వాయిదా

మానకొండూర్/ ఇల్లందకుంట, ఏప్రిల్ 27: సభ్యుల కోరం లేక పోవడంతో శనివారం జరుగాల్సిన మానకొండూర్, ఇల్లందకుంట మండల సర్వసభ్య సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా మండలాల ఎంపీడీవోలు ఎం నర్సయ్య, పుల్లయ్య, ఇల్లందకుంట ఎంపీపీ పావని తెలిపారు. సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీని తర్వాత వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

బూరుగుపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కాంగ్రెస్ బోగస్ గ్యారెంటీలను ఎండగట్టండి

- కష్టపడి పనిచేసి వినోద్‌ను గెలిపించండి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 27: ఇంటింటికీ వెళ్లి అసెంబ్లీ ఎన్నికల ముందర కాంగ్రెస్ ఇచ్చిన ఆరు బోగస్ గ్యారెంటీలను ఎండగట్టాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బూరుగుపల్లిలో శనివారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీఆర్ఎస్ గెలిస్తేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని విడమరిచి చెప్పాలన్నారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు దూలం శంకర్‌గౌడ్, దూలం బాలాగౌడ్, నాంపెల్లి, స్వామి, హరిబాబు, రవి, సంతోష్ ఉన్నారు.

ప్రజల కష్టాలు తెలిసినోడ్ని

- ఎంపీగా ఎన్నో అభివృద్ధి పనులు చేశా
- మరోసారి గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటా
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో కలిసి జమ్మికుంటలో మార్నింగ్ వాక్

జమ్మికుంటలో వాకర్స్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, పక్కన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు

జమ్మికుంట(హుజూరాబాద్), ఏప్రిల్ 27: ప్రజల కష్టాలు తెలిసినోడ్ని, ఎంపీగా మరోసారి గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఓటర్లను కోరారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో వాకర్స్‌ను కలిసి ముచ్చటించారు. ఎంపీగా తనకు అవకాశం ఇస్తే గతంలో కంటే కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని, పార్లమెంట్‌లో తెలంగాణ ఆత్మగౌరవ బావుటా ఎగరవేస్తానని పేర్కొన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు కాజీపేట, హసన్‌పర్తి, హుజూరాబాద్ మీదుగా కరీంనగర్‌కు రైల్వే మార్గం ఏర్పాటు చేయమని కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చానని తెలిపారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలను ట్విన్ సిటీస్‌గా మారుస్తానని పేర్కొన్నారు. కేంద్రం నుంచి నియోజకవర్గానికి రావాల్సిన నిధులను తప్పక తీసుకువస్తానని, హుజూరాబాద్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో కలిసి పని చేస్తానని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, అందుకే ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా ఐదేండ్లలో నియోజకవర్గానికి చేసింది శూన్యమని విమర్శించారు. అభివృద్ధి కోసం పైసా కూడా నిధులు తేని ఆయనకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణకోసం 32 పార్టీలను కలిసి సంతకాలు పెట్టించామని గుర్తు చేశారు. జిల్లా పరిషత్ సమావేశాలకు ఒక్కసారి కూడా రాని సంజయ్‌ను గెలిపించి ప్రజలు గోసపడుతున్నారని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కారును నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమని పేర్కొన్నారు. ప్రచారం అనంతరం అక్కడే రోడ్డు పక్కన వాకర్స్‌తో కలిసి వినోద్‌కుమార్ టిఫిన్ చేసి, ఛాయ్ తాగారు.

వినోద్ కుమార్‌తోనే అభివృద్ధి

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ప్రత్యేక రాష్ట్ర సాధనలో బోయినపల్లి వినోద్ కుమార్ కృషి చాలా గొప్పదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే గతంలో ఎంపీగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఉప్పల్ బ్రిడ్జి, బిజిగిరి షరీఫ్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. బండి సంజయ్ ఎంపీగా ఉండి ఐదు సంవత్సరాల కాలంలో కనీసం ఒక్కసారి కూడా హుజూరాబాద్ నియోజకవర్గం వర్గానికి రాలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తే కాంగ్రెస్ పాలనలో తిరోగమనం వైపు పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఎన్నికల్లో వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ రావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

దేశాయిపేట గ్రామంలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

చొప్పదండి, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని బీఆర్ఎస్ నేత బందారపు అజయ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం దేశాయిపేటలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి గులాబీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి అజయ్ హాజరై మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకైనా వినోద్‌ను పార్లమెంట్‌కు పంపించినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇక్కడ మాజీ సర్పంచులు గుంట రవి, చంటిబాబు, మాజీ ఉపసర్పంచ్ వెంకట రమణారెడ్డి, నాయకులు సుద్దాల శ్రీనివాస్, దుబ్బాక మల్లేశం, గంగ స్వామి, గొడుగు అంజి, పులిపాక అజయ్, రవి, తిరుపతిరెడ్డి, లచ్చయ్య ఉన్నారు.

నేడు అల్గునూర్‌కు కేటీఆర్ రాక

తిమ్మాపూర్, ఏప్రిల్ 27: అలుగునూర్‌లోని లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగనున్న బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండల బూత్ ఇన్‌చార్జిల సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొంటారని.. మండలంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బల్దియా చైర్‌పర్సన్ రాధిక, నాయకులు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద పార్టీ జెండాను రాష్ట్ర నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గందె శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఆయనతో కేక్ కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డాక్టర్ సంగెం ఐలయ్య, పీఈసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు కల్లెపల్లి రమాదేవి, మక్కపెల్లి కుమార్‌యాదవ్, పీ తిరుమల్‌రెడ్డి, అపరాజ ముత్యరాజు, తొగరు సదానందం, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, కొండ్ర జీవితానరేశ్, బీ కుమార్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు వీ రవీందర్‌రావు, నాయకులు పంజాల శ్రీధర్, కే కమలాకర్‌గౌడ్, శ్రీదేవి, బత్తుల సమ్మయ్య, ఎండీ ఇసాక్, బోళ్ల రమేశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు సాధించాలంటే వినోద్ కుమార్‌ను ఎంపీగా పార్లమెంట్‌కు పంపాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలను ఓటు అభ్యర్థించాలని సూచించారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పని చేయాలని, కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో మండల నాయకులు, అన్ని గ్రామాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, గ్రామాధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ యజమానికి భారీ జరిమానా

శంకరపట్నం, ఏప్రిల్ 27: గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని చేనవేని శ్రీనివాస్‌కు తహసీల్దార్ అనుపమ రూ.50 వేల జరిమానా విధించారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేసి ఆయన ఎక్స్‌కవేటర్‌తో మట్టిని అక్రమంగా తరలించినట్లు తెలిపారు. దీంతో శనివారం శ్రీనివాస్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి రూ. 50 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు.

సమ్మర్ అలవెన్స్ చెల్లించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్27: ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టప్రకారం మార్చిలో 30 శాతం, ఏప్రిల్‌లో 35, మేనెలలో 40 శాతం అధిక వేతనం ఇవ్వాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All
NAME CHANGE
★Salendri Anil S/o Mallesham H.No. 1-7-8, Ananthapally, Chandurthi Mandal, Rajanna Sircilla my surname was changed as Salendra Anil S/o Mallesham.
NTK-311294
NAME CHANGE
★Bojja Gattu Jyothi W/o Gattu Mohan H.No. 3-37, Ashireddypally, Chandurthi, Rajanna Sircilla Dist. My Name was changed as Gattu Jyothi, W/o Gattu Mohan
NTK-311292
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వినోద్ గెలుపు కోసం అన్నదానం

విద్యానగర్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపు కోసం శనివారం తెలంగాణ స్టేట్‌రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అభివృద్ధి ప్రదాతను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, నరసింహారాజు, రమణ ఉన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు నేడే ఆఖరు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 27: పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2024 దరఖాస్తు గడువు అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 28తో ముగియనున్నదని కరీంనగర్ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.100తో ఈ నెల 30 వరకు, రూ. 300తో మే, 20 వరకు అప్లయ్ చేసుకోవచ్చన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేడేను జయప్రదం చేయాలి

శంకరపట్నం: మేడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 27: కార్మికుల దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్ కార్మికులకు పిలుపునిచ్చారు. నగరంలోని యూనియన్ ఆఫీసు బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శనివారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలని కోరారు. ఇక్కడ ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆగయ్య, కొమురయ్య, శ్రీనివాస్, రమేశ్, కుమార్, సంపత్, రవి ఉన్నారు.

శంకరపట్నం, ఏప్రిల్ 27: మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏఐటీయూసీ నాయకులతో కలిసి మే డే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని దుయ్యబట్టారు. ఆ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కన్నం సదానందం, తాడవేని రవి, దొమ్మేటి వెంకటస్వామి, బొజ్జ సంపత్, మేకల రవి, చిట్యాల భిక్షపతి, ఎండీ అలీ, వెంకన్న, ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ అనుమానమే

కలెక్టరేట్, ఏప్రిల్ 27: ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ అనుమానమేనని తెలంగాణ రైతుల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కే కొమురయ్య అన్నారు. శనివారం కోతిరాంపూర్‌లోని సంఘ భవనంలో నిర్మించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు శ్రేయస్సు కోసం కాంగ్రెస్ సర్కారు పని చేస్తున్నదంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా రైతుబంధు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. విద్యుత్ సరఫరాలోనూ నిత్యం ఆటంకం కలుగుతున్నదని చెప్పారు. బీజేపీ సర్కారు సైతం కిసాన్ సమ్మాన్ నిధులను ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో రైతుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మొగిలి రత్నాకర్, నాయకులు నాయిని రాజేందర్, వొద్దిరాల వెంకటేశ్వర్లు, యాంసాని కృష్ణప్రసాద్, చల్లగొండ దయాకర్‌రావు, ఎడ్మల కిష్టారెడ్డి ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఎనిమిది మందికి జైలు

రాంనగర్, ఏప్రిల్ 27: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 25 మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఒకరికి ఏడు రోజులు, మరొకరికి ఐదు రోజులు, ఆరుగురికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు రూ. 16,500 జరిమానా విధించారు. మిగిలిన 17 మందికి రూ.25 వేల చొప్పున ఫైన్ వేశారు.

బీఆర్ఎస్ ప్రచారానికి విశేష స్పందన

నగరంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా శనివారం పార్టీ సీనియర్ నాయకుడు, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. తమ ఓటు బీఆర్ఎస్‌కే నంటూ అన్ని వర్గాల ప్రజలు మద్దతు ప్రకటించారు.

-కరీంనగర్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

తోపుడు బండిపై రొట్టెలు చేస్తున్న మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు

కోతిరాంపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, తదితరులు

గ్రామాల్లో బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం



ఉప్పరమల్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గంగాధర, ఏప్రిల్ 27: మండలంలోని ముప్పిడినర్సయ్యపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శనివారం ముమ్మర ప్రచారం చేశారు. గడపగడపకూ వెళ్లి కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. గ్యారెంటీల పేరిట మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. ఇక్కడ గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కమాన్ చౌరస్తా, ఏప్రిల్ 27 : ఎల్ఎండీ జడ్పీ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిరుమలపై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిరక్ష్యం కారణంగా వేటు వేస్తూ జిల్లా పరిషత్ చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు గడువులోగా పూర్తి చేయకుండా, చలాన్లు సకాలంలో చెల్లించకపోవడంతో శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 27: హుజూరాబాద్ శివారులోని సిర్సపల్లిలో సర్వే నం. 496లో మట్టి (మొరం)ని కొందరు దళారులు అక్రమంగా రవాణా చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రవణ్ కోరారు. శనివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ పట్టణంలో 2418 సర్వే నంబర్‌లో అక్రమంగా చేపట్టిన ప్రహరీని మున్సిపల్ అధికారులు కూల్చివేయగా, అనుమతులు లేకున్నా మళ్లీ నిర్మించారని తెలిపారు. అధికారుల ఉదాసీనతతో అక్రమార్కులు చెలరేగి పోతున్నారని పేర్కొన్నారు.

30న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ధర్నా

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 27: కరీంనగర్ డీఈవో కార్యాలయం ఎదుట ఈ నెల 30న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్ తెలిపారు. ఉపాధ్యాయులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ ఆఫీసులో జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లాలో పదో తరగతి పరీక్షలు, మూల్యాంకన విధుల్లో నిర్లక్ష్యం పేరిట ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై మాత్రమే చర్యలు తీసుకోవడం విచారకరమన్నారు. ఇక్కడ అసోసియేట్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి, సంఘం నాయకులు బత్తుల భూమయ్య, గిరి సురేశ్, భూక్యా రాజన్న, రంగయ్య, బన్సీలాల్ ఉన్నారు.

బీజేపీని ఓడించి హక్కులను కాపాడుకోవాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి కార్మికుల హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ అనుబంధ సంఘం సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ ఆఫీసు ముకుందలాల్ మిశ్రా భవన్‌లో శనివారం నిర్వహించిన జల్లా సదస్సులో అయన మాట్లాడారు. పదేండ్ల బీజేపీ పాలనలో కార్మికులకు అడుగడుగునా అన్యాయం జరిగిందన్నారు. ఎనిమిది గంటల పని దినాలను రద్దు చేసి 12 గంటలు పని చేసేలా చట్టాలను సవరించిందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించిందని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గుడికందుల సత్యం, పున్నం రవి, శ్రీలత ఉన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన

గంగాధర, ఏప్రిల్ 27: ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని చిన్నాచంపల్లికి చెందిన పర్నె భార్గవ్‌రెడ్డి 463, పర్నె భవాని 403 మార్కులు సాధించారు. శనివారం మాజీ సర్పంచ్ దోర్నాల హన్మంతరెడ్డి, నాయకులు రుద్ర మల్లేశం విద్యార్థులను సన్మానించి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరులు ఆశ్రమ పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో, ఏడు నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు కరీంనగర్ మల్కాపూర్